క్లుప్తంగా

రాష్ట్రస్థాయిలో విద్యార్థుల ప్రతిభ



కొత్తకోట: కళాఉత్సవ్ రాష్ట్ర పోటీల్లో కేపీఎస్ విద్యార్థులు పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబర్చి బహుమతులు సాధించినట్లు పాఠశాల డైరెక్టర్ చంద్రహాసన్‌రెడ్డి తెలిపారు. ఈనెల 15, 16 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కళాఉత్సవ్ పోటీల్లో కొత్తకోట ప్యూపిల్స్ పాఠశాలకు చెందిన వై.శ్రీఅశ్విన్ గాత్ర సంగీతంలో ప్రోత్సాహిక బహుమతి, ఎండీ జావిద్ నాటక ప్రదర్శనలో స్వామి వివేకనంద వేషధారణలో ఏకపాత్రాభినంతో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి ద్వితీయ స్థానం సాధించాడు. జావిద్‌కు జ్ఞాపికతో పాటు రూ.వెయ్యి నగదు, ప్రశంసాపత్రం ఇచ్చి సత్కరించారు. రాష్ట్రస్థాయిలో బహుమతులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

పోలింగ్ స్లిప్పుల పంపిణీపై అవగాహన



మదనాపురం: తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం తహసీల్దార్ అబ్రహంలింకన్ బూత్ లెవల్ అధికారులకు పోలింగ్ స్లిప్పుల పంపిణీపై అవగాహన కల్పించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ స్లిప్పుల పంపిణీ ప్రక్రియ బాధ్యతగా ఉండాలని బీఎల్‌ఓలకు సూచించారు. ప్రతి ఇంటికి వెళ్లి స్లిప్పులను ఓటరుకే అందజేయాలన్నారు.

మండల సభ వాయిదా



ఆత్మకూర్: మండల సర్వసభ్య సమావేశం కోరం లేని కారణంగా వాయిదా వేసినట్లు ఎంపీడీఓ వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభించిన ఎన్నికల నేపథ్యంలో ప్రజాప్రతినిధులు ఎవ్వరు హాజరు కాలేదన్నారు. ఎన్నికల అనంతరం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

పోల్కంపల్లిలో సహకార వారోత్సవాలు



అడ్డాకుల: మూసాపేట మండలం పోల్కంపల్లిలో శుక్రవారం సహకార సంఘం వారోత్సవాలను నిర్వహించారు. 70వ అఖిల భారత సహకార వారోత్సవాల్లో భాగంగా తెలంగాణ రాష్ట్ర సహకార యూనియన్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలు, సులభంగా వ్యాపారం చేయడంలో సహకార సంఘాల పాత్రపై రైతులతో విశ్లేషణ చేపట్టారు. అనంతరం రైతులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జాయింట్ రిజిస్ట్రార్లు పరిమళదేవి, ఆర్.సంగీత, వసంత, మహబూబ్‌నగర్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ బాషమ్మ, సొసైటీ సీఈఓ బాస్కర్‌గౌడ్, సిబ్బంది బాలకిష్టయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

లారీ బోల్తా : తప్పిన ముప్పు



అడ్డాకుల: మూసాపేట మండలం అచ్చాయపల్లి సమీపంలో జాతీయ రహదారిపై అదుపు తప్పి లారీ(కంటెయినర్) బోల్తా పడిన ఘటనలో అదృష్టవశాత్తు డ్రైవర్‌కు ముప్పు తప్పిపోయింది. బాధితుడి వివరాల ప్రకారం... శాఖాపూర్ గ్రామానికి చెందిన శ్రీధర్‌రెడ్డి బెంగళూర్ నుంచి లారీని హైదరాబాద్ తీసుకెళ్తున్నాడు. మార్గమధ్యలో శుక్రవారం తెల్లవారుజామున అచ్చాయపల్లి స్టేజీ వద్ద కల్వర్టు దాటిన తర్వాత లారీ అదుపు తప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లి బోల్తాపడింది. లారీ నడుపుతున్న శ్రీధర్‌రెడ్డి అదృష్టవశాత్తు స్వల్ప గాయాలతో ప్రమాదం నుంచి బయట పడ్డాడు. క్రేన్ సాయంతో లారీని పైకి తీశారు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

విద్యార్థులకు అభినందన

మిడ్జిల్: జిల్లాస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు మిడ్జిల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు చెందిన జశ్వంత్, రాజేందర్, మోహన్ ఎంపికైనట్లు పీడీ పరుశరాములు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను శుక్రవారం ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

భవిష్యత్ తరాలకు ఫలాలు అందిస్తాం



వనపర్తిలో మాట్లాడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి



సోళీపురంలో ప్రచారం చేస్తున్న తేజశ్విని

వనపర్తి: భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకుని జిల్లాను విద్యాహబ్‌గా మార్చేందుకు కృషి చేశానని, పేద కుటుంబాలకు చెందిన జిల్లా యువత ఉన్నత విద్య కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే చదువుకునేలా మెడికల్, ఇంజినీరింగ్, అగ్రికల్చర్, పీజీ కాలేజీలను ఏర్పాటు చేయించానని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా గాంధీనగర్‌కు చెందిన రాజశేఖర్, రఘు ఆధ్వర్యంలో 150 మంది బీజేపీకి చెందిన యువత మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి నిరంజన్‌రెడ్డి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, కౌన్సిలర్ పాకనాటి కృష్ణ, నాయకులు తిరుమల్, కృష్ణ యాదవ్, మురళి సాగర్, మౌలాలి, జోహెబ్, తదితరులు ఉన్నారు.

ఖిల్లాఘనపురం: వనపర్తి నియోజక వర్గంలో మంత్రి నిరంజన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి పనులు, అందించి సంక్షేమ పథకాలను చూసి కారు గుర్తుకు ఓటు వేయాలని మంత్రి నిరంజన్‌రెడ్డి సతీమణి సింగిరెడ్డి వాసంతి, కుమార్తెలు ప్రత్యూష, తేజశ్విని కోరారు. శుక్రవారం మండలంలోని సోళీపురంలో వారు మంత్రి నిరంజన్‌రెడ్డిని మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి రాష్ట్రంలో వనపర్తి జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సామ్యనాయక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, వైస్ చైర్మన్ బాలీశ్వర్‌రెడ్డి, సర్పంచ్ పద్మశ్రీ, పురేందర్‌రెడ్డి, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల మద్దతు బీఆర్‌ఎస్‌కే..

రాష్ట్రంలోని దివ్యాంగులంతా బీఆర్‌ఎస్‌కే మద్దతు ఇస్తున్నారని ఎన్‌పీఆర్‌డీ ఇండియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెస్త యాదగిరి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో తొమ్మిదేళ్లలో దివ్యాంగుల కోసం రూ.10 వేల కోట్లు ఖర్చు చేసిన గొప్ప నాయకుడు ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. కార్యక్రమంలో కురుమయ్య, నాగయ్య, రామకృష్ణ, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

19 ఏళ్లు అధికారంలో ఉండి ఏం చేశారు?



ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న నాగులపల్లి గ్రామస్తులు

కొల్లాపూర్/కోడేరు: 19ఏళ్లు అధికారంలో ఉండి కొల్లాపూర్ నియోజకవర్గానికి మాజీమంత్రి జూపల్లి కృష్ణారావు ఏం చేశారో చెప్పాలని ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం కొల్లాపూర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కోడేరు మండలం నాగులపల్లి మాజీ సర్పంచ్ రాములు, సీనియర్ నాయకులు శాంతయ్య, లక్ష్మయ్యతో పాటు పలువురు ఎమ్మెల్యే బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో రఘువర్ధన్‌రెడ్డి, కిషన్‌నాయక్, రాజశేఖర్‌గౌడ్, జగన్మోహన్‌రెడ్డి, సర్పంచ్ వెంకటస్వామి, పవన్‌కుమార్‌రెడ్డి, ఆదిసోమనాథ్, కలగొండ మంగళి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

కోడేరు: ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డిని రెండోసారి ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని ఆయన సతీమణి విజయమ్మ కోరారు. మండలంలోని తీగలపల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో రఘువర్ధన్‌రెడ్డి, కొండ సుధాకర్‌రెడ్డి, కిషన్‌నాయక్, మండల పార్టీ అధ్యక్షులు రాజశేఖర్‌గౌడ్, సర్పంచ్ శివారెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: కొల్లాపూర్ నియోజకవర్గంలో సీఎం కేసీఆర్ నాయకత్వంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో దావాజిపల్లి, దావాజిపల్లితండా, రాయినిపల్లి, మంగళ్లపల్లికి చెందిన నాయకులు పార్టీలో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, రంగినేని అభిలాష్‌రావు, సోమ్‌నాథ్‌నాయక్, వెంకటయ్యనాయుడు పాల్గొన్నారు.

వీపనగండ్ల: సీఎం చంద్రశేఖర్‌రావు ఈ నెల 19న కొల్లాపూర్ పట్టణానికి వస్తున్న నేపథ్యంలో అన్ని గ్రామాల నుంచి కార్యకర్తలు సభకు హాజరై విజయవంతం చేయాలని గౌరారం వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, ముంత మల్లయ్య యాదవ్ కోరారు.

పెద్దకొత్తపల్లి: మండలంలోని మహాసముద్రంలో కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సంక్షేమ పథకాలపై ప్రచారం నిర్వహించారు.

అవినీతిపై పోరాడేందుకు అవకాశం ఇవ్వండి



ప్రజాప్రతినిధులను కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న మేఘారెడ్డి

వనపర్తి: స్థానిక మున్సిపాలిటీలో అధికార పార్టీకి చెందిన 8వ వార్డు కౌన్సిలర్, బుడగ జంగాల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు విభూది నారాయణ, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యురాలు, మాజీ కౌన్సిలర్ కైరూన్ బేగంతో పాటు కొందరు నాయకులు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటయ్య యాదవ్, ఎంపీపీ కిచ్చారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి తూడి మేఘారెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. త్వరలో నియోజకవర్గం వారిగా అధికార పార్టీ నుంచి మరికొన్ని వలసలు కాంగ్రెస్‌లోకి రానున్నట్లు ఆయన వెల్లడించారు.

అధికారంలోకి వచ్చిన వెంటనే రుణమాఫీ

పెబ్బేరు రూరల్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఏకకాలంలో రైతులకు రూ.2 లక్షల పంట రుణాలు మాఫీ చేస్తుందని కాంగ్రెస్ అభ్యర్థి తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఆయన మండలంలోని యాపర్ల, గుమ్మడం, తిప్పాయిపల్లి, రంగాపురం, బునాదిపురం, కొత్తసూగూరు, సూగూరు, ఈర్లదిన్నె, బూడిదపాడు, గుమ్మడంతండాల్లో ఇంటింటికి వెళ్లి 6 గ్యారంటీలను వివరించారు. అనంతరం కొత్తసూగూరు దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు విజయవర్ధన్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు సురేందర్‌గౌడ్, వెంకటేష్‌సాగర్, రామచంద్రారెడ్డి, మన్యం, హనుమన్న, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని వెంకటాపురం క్రాస్ రోడ్డు వద్ద శుక్రవారం మధ్యాహ్నం వాహనాల తనిఖీ చేస్తుండగా మద్యం పట్టుకున్నామని ఎస్‌ఐ వెంకటస్వామి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గుమ్మడం గ్రామానికి చెందిన సందు కురుమన్న పెబ్బేరులో వైన్‌షాప్ నుంచి రెండు కాటన్ల ఐబీ క్వార్టర్లను కొనుగోలు చేసి అమ్మకానికి తీసుకొని మోటారు సైకిల్‌పై వెళ్తున్నాడు. వెంకటాపురం ఎక్స్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీల్లో భాగంగా 96 క్వార్టర్లు అభించాయని, వాటిని స్వాధీనం చేసుకొని కురుమన్నపై కేసు నమోదు చేయడంతో పాటు బైక్‌ను సీజ్ చేశామని ఎస్‌ఐ తెలిపారు.

14.6 లీటర్లు..

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండల పరిధిలోని చాగాపురానికి చెందిన బస్వరాజు ఎలాంటి అనుమతులు లేకుండా తన షాపులో మద్యాన్ని విక్రయిస్తున్నాడని సమాచారం రావడంతో శుక్రవారం తనిఖీ చేశామని పోలీసులు తెలిపారు. తనిఖీ చేసి 14.6 లీటర్ల మద్యాన్ని జప్తు చేసుకున్నామని చెప్పారు. జప్తు చేసుకున్న మద్యాన్ని పీఎస్‌కు తరలించి వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ అశోక్ బాబు తెలియజేశారు.

నకిలీ పురుగు మందు..

ఉండవెల్లి: మండల కేంద్రంలోని జై హనుమాన్ ట్రేడర్స్‌లో ఒక ప్రైవేట్ కంపెనీకి చెందిన నకిలీ మందులు అమ్ముతున్నారని మహబుబ్‌నగర్ జిల్లా మాగనూరుకు చెందిన కంపెనీ ప్రతినిధి సీనియర్ అసోసియెట్ మోహన్ రావు ఫిర్యాదు మేరకు శుక్రవారం దుకాణ యజమాని రాజేష్, మోహన్ రావ్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బాల్‌రాజు తెలియజేశారు. దుకాణంలో ఒక కంపెనీకి చెందిన దాదాపు రూ.12 వేలు విలువ చేసే నకిలీ మందు దొరికినట్లు చెప్పారు.

మొక్కలకు క్రమం తప్పకుండా నీరు పట్టాలి



దొండాయిపల్లిలో నర్సరీలో కవర్లల్లో మట్టి నింపే విధానాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ



గోపల్‌దిన్నెలో..

పాన్‌గల్: హరితహారంలో నాటిన మొక్కలు ఎండిపోకుండా క్రమం తప్పకుండా నీరు పట్టాలని ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని దొండాయిపల్లిలో రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలకు నీరు పట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలు, ప్రకృతి వనంలో నాటిన మొక్కలు ఎండిపోకుండా నీరు పట్టాలన్నారు. దీంతో పాటు నర్సరీలో నూతన మొక్కల కోసం కవర్లలో మట్టి నింపే విధానాన్ని ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. ఉపాధి పనులకు కూలీల సంఖ్యను పెంచాలని సూచించారు. విధుల నిర్వహణలో ఉపాధి సిబ్బంది అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈసీ అంజన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రదీప్‌కుమార్‌రెడ్డి, టీఏ, ఫీల్డ్ అసిస్టెంటు పాల్గొన్నారు.

మట్టి ఎంపికకు ప్రాధాన్యం

వీపనగండ్ల: గ్రామాల్లోని నర్సరీల్లో పెంచే మొక్కల పెంపకంలో మొదటగా మట్టి ఎంపికకు ప్రథమ ప్రాముఖ్యత ఇవ్వాలని ఎంపీడీఓ కతలప్ప అన్నారు. శుక్రవారం గోపల్‌దిన్నెలో వననర్సరీలతో పాటు పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూతుల్లో అన్ని వసతులను సమకూర్చాలని ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన కోరారు. గ్రామంలో బడి మానివేసిన చందు, నవ్య, అనూష తల్లిదండ్రులకు పిల్లలను బడిలో చేర్పించాలని సూచించారు. పిల్లలు బడిలో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి విక్రమ్ ను ఆదేశించారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి



బండపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సభ్యులు

పాన్‌గల్: కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యానికి విక్రయించి మద్దతు ధర పొందాలని ఐకేపీ సీసీలు నాగరాజు, స్వామి అన్నారు. శుక్రవారం మండలంలోని బండపల్లి, బుసిరెడ్డిపల్లి, రేమద్దుల గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రాల్లో విక్రయించే ధాన్యానికి ఏ గ్రేడ్ రకానికి రూ.2,203, సాధారణ రకానికి రూ.2,183 చెల్లిస్తారని వారు పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తూకం విషయంలో రైతులకు ఇబ్బందులు లేకుండా నిబంధనల మేరకు తూకాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సంఘం అధ్యక్షురాలు నాగేశ్వరమ్మ, విజయమ్మ, లక్ష్మి, వీఏఓలు రాజు, శేషయ్యనాయుడు, రాణి, రైతులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ రాజ్యంతోనే ఇంటింటా సౌభాగ్యం



చంద్రగడ్‌లో మాట్లాడుతున్న వాకిటి శ్రీహరి

ఊట్కూర్: ఇందిరమ్మ రాజ్యంతోనే ఇంటింటా సౌభాగ్యం వస్తుందని మాజీ ఎమ్మెల్యే సీతా దయాకర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వాకిటి శ్రీహరి అన్నారు. శుక్రవారం మండలంలోని పులిమామిడి, బిజ్వార్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పులిమామిడిలో బీఆర్‌ఎస్, బీజేపీ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. బిజ్వార్‌లో సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా పార్టీ నాయకులతో కలిసి బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలను ఓడిద్దాం అనే కరపత్రాన్ని విడుదల చేశారు. వారు మాట్లాడుతూ రెండు పర్యాయాలు బీఆర్‌ఎస్‌కి అధికారం ఇచ్చిన ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని ఆరోపించారు. కార్యక్రమంలో సర్పంచ్ సూరయ్యగౌడ్, జెడ్పీ చైర్‌పర్సన్ వనజమ్మ, లక్ష్మారెడ్డి, ఎల్కోటి నారాయణరెడ్డి, బాలకృష్ణారెడ్డి, మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా: మండలంలోని కున్సి, ముడుమాల్‌లో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు బాలకృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కున్సికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సూగప్ప వాకిటి శ్రీహరికి తన సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

అమరచింత: కొట్లాడి సాధించుకున్న రాష్ట్రాన్ని ఆగం చేసింది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే అని కాంగ్రెస్ అభ్యర్థి వాకిటి శ్రీహరి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం మండలంలోని చంద్రగడ్, కిష్టంపల్లి, ఈర్లదిన్నె, మిట్టనందిమళ్ల, చింతరెడ్డిపల్లెలో పర్యటించి కాంగ్రెస్ పార్టీకి ఓటెయ్యమని వేడుకున్నారు.

కాంగ్రెస్ ప్రభంజనాన్ని అడ్డుకోలేరు

రాష్ట్రంలో కాంగ్రెస్ విజయాన్ని ఎవరూ అడ్డువచ్చినా ఆపలేరని టీపీసీసీ గీత కార్మిక సంఘం రాష్ట్ర చైర్మన్ కేశం, గరాజ్ గౌడ్ అన్నారు. మండలంలోని మస్తిపురంలో శుక్రవారం వివిధ పార్టీల నుంచి వచ్చిన పలువురిని కాంగ్రెస్ పార్టీలోకి కండువాలు కప్పి ఆహ్వానించారు.

మక్తల్: రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం రావడం ఖాయమని బీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని మాగనూర్, కృష్ణ, మక్తల్, నర్వలో ప్రచారం నిర్వహించారు.

ఆత్మకూర్: కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని నాయకులు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. శుక్రవారం పట్టణంలో బీఆర్‌ఎస్, బీజేపీలకు చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరారు.

ముమ్మరంగా ప్రచారం

6 గ్యారంటీల అమలు

వీపనగండ్ల: కాంగ్రెస్ పార్టీ అమలు చేయనున్న 6 గ్యారంటీలపై శుక్రవారం మండల కేంద్రంలో నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కొల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావుకు ఓటు వేయాలని మండల అధ్యక్షుడు బీరయ్యయాదవ్, కిసాన్ సెల్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, మహేష్, బాలపీరు, ఆంజనేయులు, రాములు, మద్దిలేటి కోరారు.

ఎన్నికల బరిలో ఎన్‌ఆర్‌ఐ

వనపర్తి: వనపర్తి అసెంబ్లీ ఎన్నికల బరిలో కొల్లాపూర్ నియోజకవర్గం పాన్‌గల్ మండలం దావాజిపల్లికి చెందిన ఎన్‌ఆర్‌ఐ లీసం రుక్మాంగధర్ అనే యువకుడు స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉన్నారు. సుమారు 15 ఏళ్ల పాటు అమెరికాలోని కొలంబస్ ఓహాయో అనే ప్రాంతంలో నివాసం ఉండేవాడు. గ్రీన్‌కార్డు పొందే అవకాశం ఉన్నా భారత పౌరుడిగానే ఉన్నాడు. ఇటీవల స్వదేశానికి వచ్చి తన తండ్రి రిటైర్డ్ ఉద్యోగి మన్యంతో కలిసి వ్యవసాయం చేస్తున్నాడు.

బీఆర్‌ఎస్ గెలుపు ఖాయం

ఆత్మకూర్: కాంగ్రెస్, బీజేపీ నాయకుల హామీలను నమ్ముకుంటే మూడు గంటలే కరెంటు వస్తుందని బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. శుక్రవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మండల అధ్యక్షుడు రవికుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో నమాజు అనంతరం మస్‌జిద్‌ల వద్ద కారు గుర్తుకు ఓట్లు వేయాలని ముస్లింలను అభ్యర్థించారు. కార్యక్రమంలో గాయత్రి, విజయభాస్కర్‌రెడ్డి, బంగారుశ్రీను, జెడ్పీటీసీ శివరంజని, కృష్ణమూర్తి, లక్ష్మీకాంత్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, కోటేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే పేదలకు సంక్షేమ ఫలాలు



జలంధర్‌రెడ్డికి మద్దతుగా మక్తల్‌లో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

కృష్ణా: రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని, బీసీ అభ్యర్థే ముఖ్యమంత్రి అవుతారని ఆ పార్టీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి జలేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఆలంపల్లి, కున్సి, చేగుంట, కృష్ణా, తంగిడి, హిందుపూర్ గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు జలంధర్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. కృష్ణాలో మహిళలు పూర్ణ కుంభం, హారతులతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో కొండయ్య, సోమశేఖర్‌గౌడ్, మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, మజ్జిగ సురేష్, ఎంపీటీసీ వెంకటేష్, నల్లె సర్సప్ప,రాఘవేంద్ర ఉన్నారు.

మక్తల్: అసెంబ్లీ ఎన్నికల్లో మక్తల్‌లో ప్రజల ఆశీర్వాదంతో బీజేపీ జెండా ఎగరవేస్తామని మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గ్రామాల్లో జలంధర్‌రెడ్డి, పట్టణంలోని వార్డుల్లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొండయ్య ప్రచానం చేశారు. వీరితో పాటు పద్మజారెడ్డి మక్తల్ పట్టణంలో జోరుగా ప్రచారం చేస్తున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పావని, మున్సిపల్ వైస్ చైర్మన్ అఖిలారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ కర్నిస్వామి, ఈసరి నాగప్ప, కౌన్సిలర్లు కౌసల్య, అర్చన, ఎంపీటీసీ బాల్‌రాంరెడ్డి, రంగప్ప, తిమ్మప్ప, రాజశేఖర్‌రెడ్డి, శ్రీకాంత్, నాగప్ప, కుర్వలింగం, ద్యావరింటి నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ ప్రచారం

అమరచింత: కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించడంతో పాటు రాష్ట్ర అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమంటూ పట్టణంలో శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో డిజిటల్ ప్రచారం నిర్వహించారు. మక్తల్ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి జలేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.

ఎమ్మెల్యేగా ఆశీర్వదిస్తే అండగా ఉంటా



మాట్లాడుతున్న ఎల్లేని సుధాకర్‌రావు

కొల్లాపూర్/కోడేరు/వీపనగండ్ల/పెంట్లవెల్లి/పెద్దకొత్తపల్లి: ఆశీర్వదిస్తే అండగా ఉంటానని ఎమ్మెల్యే అభ్యర్థి ఎల్లేని సుధాకర్‌రావు అన్నారు. పెంట్లవెల్లి మండలం గోప్లాపూర్ గ్రామానికి చెందిన పలువురు నాయకులు శుక్రవారం ఆయన సమక్షంలో బీజేపీలో చేరారు. అనంతరం ఎల్లేని మాట్లాడుతూ మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డిలు నియోజక ప్రజలను స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకున్నారని వారికి చేసిందేమీ లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. కోడేరు మండలంలోని తుర్కదిన్నె, రాజాపూర్‌లో పరివర్తన యాత్రలో ఎల్లేని పాల్గొని మాట్లాడారు. ఒక్కసారి అవకాశం ఇస్తే విద్య, వైద్య, రవాణా, ఉపాధి రంగాలలో కొల్లాపూర్‌ను నంబర్‌వన్‌గా తీర్చిదిద్దుతానన్నారు. వీపనగండ్ల మండలంలోని వల్లాభాపురం తండా, వంటిమిట్ట తండాలలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పెంట్లవెల్లిలో, జటప్రోల్ గ్రామాల్లో ఎల్లేనికి మద్దతుగా బీజేపీ, జనసేన నాయకులు ప్రచారం చేశారు. పెద్దకొత్తపల్లి ముష్టిపల్లిలో బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి జలాల్ శివుడు కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎల్లేనిని ఆదరించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌యాదవ్, శేఖర్‌గౌడ్, సాయికృష్ణగౌడ్, శివకృష్ణ, మహేష్ తదితరులున్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం



పాన్‌గల్: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే రోగాలకు దూరంగా ఉండొచ్చని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య అన్నారు. శుక్రవారం డ్రైడేలో భాగంగా మండలంలోని శాగాపూర్, కేతేపల్లి గ్రామాల్లోని పలు కాలనీల్లో పర్యటించి పరిసరాల శుభ్రత, కీటక జనిత వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వారానికి ఒక్కసారి నిల్వ నీటిని పారబోసి నూతన నీటిని పట్టుకోవాలని సూచించారు. నిల్వ నీటిలో దోమల లార్వా నిర్మూలనకు అబ్బేట్ ద్రావణాన్ని కలిపినట్లు ఆయన పేర్కొన్నారు. శాగాపూర్‌లోని పలు కాలనీల్లో తాగునీటి పైపులైన్ల లీకేజీలు ఉన్నాయని, వాటికి మరమ్మతు చేపట్టాలని సర్పంచ్‌కు సూచించినట్లు ఆయన తెలిపారు. వ్యాధులు సంభవిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని, నిర్లక్ష్యం చేయొద్దన్నారు. ఏఎన్ఎం సుమిత్ర, పంచాయతీ కార్యదర్శి మహేష్‌గౌడ్, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా మందులు వాడాలి

టీబీ వ్యాధిగ్రస్తులు వైద్యుల సూచనల మేరకు క్రమం తప్పకుండా మందులు వాడితే రోగం నయమవుతుందన్నారు. కేతేపల్లిలో టీబీ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రెండు వారాలకు మించి దగ్గు, రాత్రి వేళల్లో జ్వరం, చెమటలు పట్టడం, స్వల్పకాలంలో బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే తెమడ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ నిమిత్తం పలువురి అనుమానితుల నుంచి తెమడను సేకరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శ్రీలక్ష్మి, రాంచందర్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్పంచ్ కుటుంబానికి పరామర్శ

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండల పరిధిలోని శివనంపల్లి సర్పంచ్ గోవిందమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అబ్రహం, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ సతీమణి మహాలక్ష్మి శుక్రవారం గ్రామానికి చేరుకొని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలియజేసి, నాయకులతో కలిసి అంతిమయాత్రలో పాల్గొన్నారు. నాగశిరోమణి, రుక్మాందర్‌రెడ్డి, రాజ్‌కుమార్, రామకృష్ణారెడ్డి, శేఖర్, సంపత్, సాయి చరణ్ తదితరులు పాల్గొన్నారు.